# హిందువులు ఐక్యమత్యంగా ముందుకు సాగాలి



రుద్రూర్, బతుకమ్మ :హిందువులు ఐక్యమత్యంగా ముందుకు సాగాలని, భారతదేశంలో జన్మించిన ఒక ఆధ్యాత్మిక సాంప్రదాయం హిందూ ధర్మం అని 108 సద్గురు మహాదేవ స్వామిజీ అన్నారు. ఆదివారం రుద్రూర్ మండల కేంద్రంలోని శశిరేఖ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిగా 108 సద్గురు మహాదేవ స్వామిజీ (గుడిమెట్ల పీఠాధిపతి) హాజరయ్యారు. బస్టాండ్ ప్రాంగణంలోని చత్రపతి శివాజీ మహారాజ్ చౌక్ నుండి శశిరేఖ గార్డెన్ ఫంక్షన్ హాల్ వరకు హిందువులు ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మహదేవ స్వామీజీ మాట్లాడుతూ హిందూ ధర్మం విశిష్టతను ప్రతి భారతీయుడు తెలుసుకోవాలని సూచించారు. సమాజ శ్రేయస్సు కోసం హిందువులు ఏకతాటిపై నడవాలని పేర్కొన్నారు. పురాణాలు, ఇతిహాసాలు, సాంప్రదాయ ప్రభావంతో సనాతన ధర్మం ప్రారంభమైందని, ఈ సనాతన ధర్మం ప్రతిరూపమే హిందూ సమ్మేళనం అన్నారు. ముఖ్యంగా సనాతన ధర్మం పాటించినప్పుడే సమాజం బాగుంటుందన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ధర్మం వైపు మొగ్గు చూపాలన్నారు. అదే విధంగా హిందూ సనాతన ధర్మాలను, వాటి ప్రాముఖ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన కూచిపూడి నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బెజుగం వెంకటేశ్వర్ గుప్తా, ప్రధాన వక్తలు నర్రా వెంకట శివకుమార్, పెద్దలు, హిందూ సంఘాల నాయకులు, యువకులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# టీఎన్జీవో కేంద్ర సంఘ ఎన్నికలు ఏకగ్రీవం

## రాష్ట్ర అధ్యక్షులుగా మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా డా.ఎస్ఎం.హుస్సేని




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :టీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా మారం జగదీశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డా.ఎస్ఎం.హుస్సేని (ముజీబ్) మరో మారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు గచ్చిబౌలి టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ ఆవరణలో ఎన్నికల అధికారిగా సుగుణాకర్ రెడ్డి, సహాయ ఎన్నికల అధికారి సురేష్‌లు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా, టిఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పోస్టులతో పాటు మొత్తం 19 పోస్టులకు సింగిల్ సెట్ నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో వారందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. తమపై నమ్మకముంచి, మరోమారు రాష్ట్ర కమిటీకి నాయకత్వం వహించే అవకాశం కల్పించిన అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులకు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక ముందు కూడా ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఏకైక ఎజెండాగా పని చేస్తామన్నారు. అనంతరం నూతనంగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను టీఎన్జీవో నిజామాబాద్ జిల్లా పక్షాన మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, టిఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు గైని గంగారం, రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా సహాధ్యక్షులు పెద్దోళ్ల నాగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మచ్చకూరి సతీష్ కుమార్, ఆర్మూర్ యూనిట్ అధ్యక్షులు శశికాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ మహిళలు అక్షరాస్యులుగా మారాలి

## ఉల్లాస్ మహిళ వయోజన విద్యా పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ప్రాజెక్టు అధికారి



వేల్పూర్, బతుకమ్మ :గ్రామీణ ప్రాంతంలో ఉంటున్న మహిళలు నిరక్షరాస్యత నుండి అక్షరాస్యులుగా మార్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఉల్లాస్ వయోజన విద్య కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని జిల్లా ప్రాజెక్టు అధికారి సంధ్యారాణి అన్నారు. వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ఉల్లాస్ వయోజన విద్య పరీక్ష కేంద్రాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. విద్యను అభ్యసించి పరీక్ష రాస్తున్న వయోజన మహిళలతో మాట్లాడుతూ చదువుకు వయసుతో సంబంధం లేకుండా ఎప్పుడైనా చదువుకోవచ్చనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందని అన్నారు. అనంతరం పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం మాణిక్యం, సీసీలు సాయన్న, వెన్నెమురళి, పి ఓ ఏ లు సుమలత, లత, రూప, స్వరూప మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

### డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన

# ఆరుగురికి జైలు శిక్ష

### 35 మందికి భారీ జరిమానా




నిజామాబాద్ క్రైం, బతుకమ్మ :మద్యం తాగి వాహనాలు నడిపినటువంటి 41 మందిని అరెస్ట్ చేసినట్లు ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ పి. ప్రసాద్ తెలిపారు. ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశానుసారం శనివారం వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హైమద్ మొయిద్దిన్ వద్ద హాజరుపరచగా 35 మందికి ఒకరికి రూ.10,000 చొప్పున రూ.3,50,000 జరిమనా విధించారన్నారు. దిలరన్ పత్రే, బోరె రాజు, మేకపతి చంద్ర శేఖర్, షేక్ హుస్సేన్, సురారం సంజీవ్, దాసరి శ్రీకాంత్ అనే ఆరుగురికి మాత్రం వారం రోజుల జైలు శిక్ష విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

### ఉత్తమ యోగా మాస్టర్‌కు

# నంది అవార్డు



రుద్రూర్, బతుకమ్మ :రుద్రూర్ గ్రామానికి చెందిన యోగా మాస్టర్ సతీష్ గౌడ్ నంది అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ లోని ఎఫ్టిసిసిఐ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో రితిక ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో ఉత్తమ యోగా మాస్టర్ సతీష్ గౌడ్ ఆదివారం నంది అవార్డు అందుకున్నారు. నంది అవార్డు రావడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# మహిళలకు అక్షర వికాసం




రుద్రూర్, బతుకమ్మ :అమ్మకు అక్షరమాల పేరుతో మహిళా సంఘం సభ్యులకు అందరికీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా రుద్రూర్ మండల కేంద్రంలో ఆదివారం మహిళలకు అక్షర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. రుద్రూర్ మండలంలోని 5 గ్రామ పంచాయతీలలో బొప్పాపూర్, రుద్రూర్, చిక్కడపల్లి, సులేమాన్ నగర్, రాయకూర్ క్యాంప్ గ్రామాల వారికి మొదటి విడతగా 238 మంది మహిళలకు అక్షర వికాసం పుస్తకం సహాయంతో తెలుగు రాయడం, చదవడం, అంకెలు గుర్తించడం, గత సంవత్సరం అక్టోబర్ 27 నుండి 150 రోజులపాటు మహిళలకు రాత్రిపూట వివోఏల సహాయంతో రాత్రి బడి నిర్వహించడం జరిగింది. అందులో నుండి 55 శాతం సభ్యులకు పరీక్ష పత్రం ఇచ్చి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి బాలగంగాధర్, ఎంఈఓ శ్రీనివాస్, డీపీఎం ఎస్ వెంకటేష్, ఐకేపి బస్వంత్, సిసిలు చిన్న గంగారం, పూల్ సింగ్, విట్టల్, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.